# చాపకింద నీరు

-వి. రామలక్ష్మి



సోములు ఆ కవరు చింపి ఉత్తరం చదవటం మొదలెట్టాడు. కొంచెం చదివి చిరాగ్గా ఆ ఉత్తరాన్ని టేబుల్‌పై పెట్టి మిగిలిన ఉత్తరాల్ని చదవసాగాడు. ఫాన్ మెయిల్ అది. పాఠకుల్లో అతనికి చాలా ఫాలోయింగ్ వుంది. మిగిలిన ఉత్తరాలు చదవటం పూర్తి చేసేసరికి మూడ్ మళ్ళీ మామూలై సంతోషం, గర్వం కొంచెం పెరిగి ముఖం వికసించింది. ఆఫీస్ టైమయ్యాక రోజూ లాగే ఉత్తరాలన్నీ బేగ్‌లో వేసుకుని బయలుదేరుతూ టేబుల్ మీద సాంతం చదవకుండా వదిలేసిన ఆ ఉత్తరాన్ని తీసి చింపబోయి మళ్ళీ ఎందుకో బ్యాగ్‌లో వేసుకున్నాడు.

తలుపు తీసిన తల్లి ఏం మాట్లాడకుండా లోపలికెళ్ళింది.

'శిరీష దగ్గర్నుంచి ఫోనొచ్చిందామ్మా?"

"ఊ!"

"ఏవంది? ఎప్పడొస్తుందట?"

"ఏమో!"

తల్లి ముక్తసరి సమాధానానికి విసుక్కోబోయి ఆవిడ ముఖం చూసి ఎందుకో మానేశాడు.

"ఫోనులో ఏం చెప్పిందమ్మా?" సహనాన్ని తెచ్చి పెట్టుకుంటూ మళ్ళీ ప్రశ్నించాడు.

"రేపు సాయంత్రం బస్సుకి తమా, పాపా వస్తున్నారుట. పాప స్కూల్ డ్రెస్. టై, బూట్లూ రెడీ చేసి వుంచమంది".

శిరీష ఎప్పుడూ ఇంతే. ఆఫీసుకి ఫోను చేస్తే ఇటువంటి విషయాలు తను ఇంట్లో చెప్పడం మర్చిపోతాడని ఇంటికే చేస్తుంది.

"వాళ్ళ నాన్నకెలా వుందిట?"

"బానే వుందిట".

మావ గారికి హార్ట్ ఎటాక్ వచ్చిందని ఫోను వస్తే తను, శిరీష, పాప వెళ్ళారు. కొంచెం నెమ్మదించాక తను ఒక్కడే వచ్చేశాడు. ఇంకో రెండ్రోజులు ఆఫీసుకి సెలవు పొడిగించి శిరీష వుండిపోయింది.

"అమ్మా..." అంటూ ఏదో చెప్పబోయి అటు చూసేసరికి తల్లి అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

'ప్చ్! అమ్మ ఏమిటో ఈ మధ్య మూడీగా తయారయింది' అని మనసులో అనుకుంటూ ఒక నిట్టూర్పు విడిచి అక్కణ్ణుంచి లేచాడు.

*** *** ***

రాత్రి భోజనం అయ్యాక సోములు తన గదిలో టేబుల్ లైట్ వేసుకుని చాలా సేపు రాశాడు. రాయడం పూర్తయ్యాక పెన్నూ, కాగితాలు సర్ది చేతి వేళ్ళు విరుచుకుని కుర్చీలో బద్ధకంగా వెనక్కి వాలి తన కింద రెండు చేతులు, చేతి వేళ్ళు కలిపి తలకి సపోర్టుగా పెట్టుకున్నాడు. కళ్ళు మూసుకుని అయిదు నిమిషాలు సేద తీరాడు. తరువాత లేచి లైటార్పబోతూ అసంకల్పితంగా టేబుల్ మీది ఆ ఉత్తరాన్ని తీశాడు. విప్పి చదవటం మొదలుపెట్టాడు. ఆప బుద్ధి కాలేదు. అలాగే ఆసాంతం చదువుతూ వుండిపోయాడు.

నా అభిమాన రచయిత సోములు గారికి,

నమస్కారం. నేను ముందు నుంచీ మీరు రాసిన కథలు చదువుతున్నాను. నాకు మీ రచనలంటే చాలా చాలా ఇష్టం. కాని ఈ మధ్య మీ ధోరణి మారింది. ఎందుకో నాకర్థం కావడం లేదు. మీరు వాస్తవ జీవితం నుంచీ, వాస్తవ సమస్యల్నుంచీ దూరమై కల్పిత సమస్యలను సృష్టించి రచనలు చేస్తున్నారనిపిస్తోంది. అందుకే ఈ మధ్య మీరు రాసే కథలు నాకు నచ్చటం లేదు. నాకు మీ కథలు నచ్చేటప్పుడు నేను మీకు ఉత్తరాలు రాయలేదు. అలా రాయటం నాకిష్టం వుండదు. వాటిని మెదడులో గుర్తు పెట్టుకుని, మాకు ఎదురయ్యే సమస్యల గురించి ఎలా లోతుగా ఆలోచించాలో నేర్చుకునేదానిని. మీరు అంత గొప్పవారు, ఇంత గొప్పవారు అని రాయటం నాకు నచ్చదు. ఎందుకంటే మీరు మామూలు మనుషులకన్నా ఎక్కువ ఆలోచించే శక్తి గలవారు. ఈ సమాజాన్ని, సమస్యల్ని కూలంకషంగా అర్థం చేసుకుని మీ కథలలో చర్చించాల్సిన బాధ్యత మీకుంది. అలా చేయటం మీ బాధ్యత అని నా అభిప్రాయం.

ఇప్పుడెందుకు రాస్తున్నానంటే పెడదారి పట్టిన మీ దృష్టిని మీకు గుర్తు చేయడానికి, మళ్ళీ మా పాత అభిమాన రచయితగా మిమ్మల్ని చూడాలన్న కోరికే నా ఈ ప్రయత్నం.

మీరు ఇప్పుడు కథలలో రాసే లైంగిక స్వేచ్ఛ ఎవరికి అవసరం?

దళిత వర్గాల బడుగు స్త్రీలకా? ఈ మధ్య పేపర్లో చూశాను. ఆ స్త్రీలను ఇంటర్వ్యూ చేసి, స్టేటిస్టిక్స్ తీసి రాసిన ఒకరి అభిప్రాయం. ఆ స్త్రీలకు లైంగిక స్వేచ్ఛతో పని లేదు. వాళ్ళకి కావలిస్తే ఇంకొకళ్ళు ఇవ్వక్కర్లేకుండానే ఆ స్వేచ్ఛని తీసుకోగలరు. తొంభై శాతం పైగా స్త్రీలు స్పష్టంగా చెప్పిన విషయాలేమిటంటే - వాళ్ళకి తిండి మాత్రమే సమస్య. తెల్లారి లేచింది మొదలు రాత్రి నిద్ర పోయేదాకా తిండెలా గడుస్తుందన్నది మాత్రమే సమస్య. తుపానుల్లాంటివి వచ్చినప్పుడు గూడెలాగన్నది తరువాత సమస్య. వాళ్ళు జీవన పోరాటంలో ఎన్ని కష్టాలు పడుతున్నదీ, ఎంత దోపిడీకి గురయ్యేదీ, ఎంత హృదయ విదారకమైన పరిస్థితుల నెదుర్కొనేదీ వాస్తవ విషయాలు.. వాటి గురించి ఆలోచించండి.

ఇక మధ్యతరగతి స్త్రీలు. ఇప్పుడు వారిలో చాలా మంది ఉద్యోగాలు చేస్తున్నారు. అందులో నేనూ ఒకతెను. నేను ఉద్యోగం చేయడానికి ఎన్ని అనుభూతులను పోగొట్టుకోవలసి వస్తుందో మీకు తెలుసా?

బిడ్డ పుట్టిన మూడు నెలలకే దాన్ని అత్తగారి మీదో, తల్లి మీదో, వాళ్ళెవరూ లేకపోతే పనివాళ్ళ



మీదో వదిలి ఉద్యోగానికి వెళ్ళాల్సి వస్తోంది. బిడ్డకి తల్లిపాలు పది నెలల దాకా అవసరం. ఆ అనుభూతి నుంచి నేనూ, నా బిడ్డా దూరం కావలసి వచ్చిన పరిస్థితులు ఎంత బాధాకరమైనవి! దాన్ని పొందడానికి ఉద్యోగం వదులుకుంటే ఆయన ఒక్క జీతంతో ఇల్లు గడవడం ఎలా?

ఇంకో విషయం, నేను చదువుకున్నాను. 'పిల్లల్ని ఎలా పెంచాలి' అన్న విషయంపై నాకు కొన్ని అభిప్రాయాలున్నాయి. వాటిని నేను ఎలా ఆచరణలో పెట్టగలను? తెల్లారి లేస్తూనే టైమ్‌తో పోటీపడి పరుగెత్తుతూ ఆఫీసుకి పోవాలి. పిల్లలు స్కూలుకి పోతారు. నేను తిరిగి కొంపకి చేరేసరికి నగరంలో రాత్రి తొమ్మిది దాటనే దాటుతుంది. ఆసరికి పిల్లలు నిద్రపోతారు. ఉన్న ఒక్క ఆదివారం స్నేహితులతో/వారంలో బకాయిపడ్డ పనులో, లేక ఎంటర్‌టైన్‌మెంటో, ఏదో ఒకటి. ఇంక నేనెప్పుడు పిల్లల్ని తీరిగ్గా కూర్చోబెట్టుకుని మంచి చెడ్డలు చెప్పగలను? వాళ్ళ పెంపకం వెనక తరం స్త్రీల అభిప్రాయాలతో జరుగుతుంది. అలాక్కూడా కుదరక, పనివాళ్ళ దగ్గర అయితే గాలికీ, ధూళికీ పెరిగినట్టే భావితరం అయిన ఈ బాలల బాల్యం ఈ రకంగా వుంది. వాళ్ళకి, పెద్దయ్యాక ఎలాంటి వ్యక్తిత్వం ఏర్పడుతుంది? ఏమో!

చచ్చీ చెడీ ఒళ్ళు హూనం అయి ఇంటికి చేరిన నాలాంటి స్త్రీలకు రాత్రి పడక చేరేసరికే మినిమమ్ టైమ్ పదకొండున్నర. అప్పుడు అలసటతో కళ్ళు మూసుకుపోతూ, ఒళ్ళు తూలిపోతూ వుంటుంది. భర్తతోనే సెక్స్‌లో పాల్గొనటానికి ఓపిక వుండదు. ఇంక వివాహేతర సంబంధాల ప్రసక్తి ఎందుకు?

ఇంకో దృష్టితో ఆలోచిస్తే మా అమ్మ, మా అత్త గారూ వాళ్ళు వృద్ధాప్యంలో, ఇంకొకరు వండి పెడితే సుఖంగా కృష్ణా, రామా అంటూ కాలం గడపాల్సి వయసులో తిరిగి చంటి పిల్లలకి పాలు పట్టడం, గోరు ముద్దలు తినిపించడం, వాళ్ళతో సమానంగా పరుగెత్తాల్సి రావటంతో శారీరకంగా, మానసికంగా ఎంత అలసటకు, ఎంత టెన్షన్‌కు గసరవుతున్నారో గమనించారా?

ఇంక ఉన్నత వర్గాల స్త్రీలను గమనిస్తే ఉద్యోగాల్లో అయితే కెరీర్ గురించి, హౌస్ వైఫ్ అయితే – బిజినెస్ తాలూకు టెన్షన్‌తో ఇరవై నాలుగ్గంటలూ దానికే అంకితమైన భర్తలనుంచి ఏ సామీప్యతా లభించక ఒంటరితనంతో – మానసిక అనారోగ్యానికి గురయ్యేవాళ్ళు, చెడుదారి పట్టేవాళ్ళు ఇలా–

నేటి సంక్లిష్ట జీవితంలో సమస్యలు కోకొల్లలు. స్త్రీలందరికీ కేవలం లైంగిక స్వేచ్ఛ ప్రసాదించినంత మాత్రాన జీవితాలు మెరుగవ్వవు. లైంగిక స్వేచ్ఛ దొరికినందువల్ల సమస్యలేవీ రావా? సమాజ గమనం ఏ రకంగా మారుతుంది? అవసరమా? మిగిలిన సమస్యలకన్నా అంత ముఖ్యమా?

అసలు జీవితం నేడు ఇంత క్లిష్టం అవడానికి కారణాలేమిటి? ఏ ఆర్థిక, వ్యాపార కారణాల వల్ల సామాన్య మానవుడి జీవితం బ్యాలన్స్ తప్పి తలక్రిందులవుతోంది? చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకూ ఎన్ని టెన్షన్లు, ఎన్ని రోగాలు! దీనికి కారణం ఏమిటి? చాప కింద నీరులా మనని ముంచే సంస్కృతికి మూలాలు ఏమిటి? మీ రచనలు ఆ సంస్కృతిలో ఒక భాగమా?

సోములు గారూ! మీరు సమర్థులు. తలుచుకుంటే, కొద్దిగా ఆలోచిస్తే అవన్నీ మీ కంటికి అగుపిస్తాయి. దయ చేసి తప్పదారి పట్టించే విషయాలు వదిలేసి సమాజ ప్రయోజనం గురించి ఆలోచించండి. మీ కలం నుంచి వెలువడే, సమాజానికి హితవు చేసే కథల గురించి ఎదురు చూస్తూ,

–మీ అభిమాని

–దర్శని.

ఉత్తరాన్ని నిర్లక్ష్యంగా టేబుల్ పైకి విసిరాడు సోములు. 'నేను వ్రాసే కథలు విలువైనవి కాకపోతే ఇంతమంది అభిమానులు ఇన్ని ఉత్తరాలు ర! ఇన్ని అవార్డులు వస్తాయి? ఇంత మంది రచయిత మిత్రులు అభినందిస్తారా? ఆమెదంతా చాదస్తం. తెలివి తక్కువతనం. అభిమాని అంటుంది. ఉత్తరంలో ప్రతి అక్షరం నన్ను విమర్శిస్తుంది. అన్ని పొగడ్తల సాగరాల ముందు బిందువు లాంటి ఈ ఉత్తరం ఏపాటిది? అంతా ట్రాష్!' అనుకుంటూ లేచి లైటార్పి, బెడ్ లైట్ వేసి బాత్‌రూమ్‌కి పోవడానికి రూమ్ నుంచి హాల్లోకి వచ్చాడు. అక్కడి దృశ్యం చూసి ఒక్కసారిగా అతని వెన్ను జలదరించింది.

ఆ బెడ్ లైట్ వెలుతురులో మంచం మీద ఒక ఆకారం కూర్చుని వుండడం కనిపించింది. ఒక్క క్షణంలో తేరుకుని లైటు వేశాడు సోములు. అమ్మని అలా చూసి కంగారుపడ్డాడు. టైమ్ ఒంటిగంటన్నర. ఇంత రాత్రి వేళ అలా కూర్చుందేవిటి? లైటేసినా తనని గుర్తు పట్టకుండా అలా శూన్యంలోకి చూస్తోందేమిటి?

సోములు కంగారుగా తల్లిని సమీపించి ఆమె భుజాలు రెండూ పట్టుకుని కదుపుతూ "అమ్మా! అమ్మా!" అని పిలవసాగాడు.

నాలుగైదు సార్లు పిలిచి గట్టిగా కుదిపాక ఈలోకంలోకి వచ్చింది తల్లి. బిడ్డకేసి ఒక్కసారి చూసి వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టింది. సోములుకి పై ప్రాణాలు పైన్నే పోయాయి.

"అమ్మా! ఏం జరిగిందమ్మా? ఎందుకమ్మా?" అని అంటూ ఆవిడని పొదవి పట్టుకుని వీపు రాస్తూ అడుగసాగాడు.

ఎంత తరచి అడిగినా ఆవిడ స్పష్టంగా చెప్పలేక పోయింది. మధ్య మధ్యలో ఆవిడ అన్న ఒక్కో ముక్కా పేర్చుకుంటే అతనికి అర్థం అయిందిది– పని మనిషికి పాప స్కూలు యూనిఫాం ఉతక డానికి వేయడం మరచిపోయింది ఆవిడ. దానికి ఆవిడ విపరీతంగా భయపడుతోంది దేనికి? శిరీష రాక్షసి కాదే! మరి అమ్మ ఎందుకిలా అయింది? ఏ పరిస్థితులావిడను భయపెడుతున్నాయి?

ఏడ్చి ఏడ్చి ఆవిడ అతని భుజం మీద తలపెట్టి నిద్ర పోయింది. ఒక్క నిమిషం కుదుట పడ్డాక, అతని మెదడు పని చేశాక అతని శరీరానికి ఒక విషయం స్పష్టం అయ్యింది. అది పక్క చల్లగా, తడిగా వుండడం! అంటే ..అంటే..అమ్మ! ఓహ్ భగవంతుడా? ఏం చేయాలిప్పుడు?

మెల్లిగా తల్లిని తప్పించి ఆ దుప్పటి, బొంత లాగి పారేవాడు. ఆ సవారు మంచం మీద ఆవిడని మెల్లిగా మెలకువ రాకుండా పడుకోబెట్టి ఇంకో దుప్పటి కప్పాడు.

'అమ్మని సైకియాట్రిస్ట్‌కి చూపించాలి!' అని నిశ్చయించుకుని బాత్‌రూమ్‌కు వెళ్ళాడు. తిరిగి వచ్చి పడుకున్నాడు. రకరకాల ఆలోచనలు. పక్కమీద అటూ, ఇటూ దొర్లుతున్నాడు. కొద్ది సేపయ్యాక లేచి టేబుల్ లైట్ వేసుకుని, కుర్చీలో కూర్చుని దర్శిని ఉత్తరాన్ని స్థిమితంగా చదివాడు. తరవాత దాన్ని జాగ్రత్తగా మడత పెట్టి తన డైరీలో పైన పెట్టి ఎగిరి పోకుండా పేపర్ వెయిట్ వుంచాడు. కాగితం, కలం తీసుకుని దర్శనికి జవాబు రాశాడు.

' 'థ్యాంక్యూ–' అని.